దిన పత్రిక
తొలి సమయం
వాస్తవమే గమ్యం! గమనం!!

మంగళవారం । 19 । మే । 2026

# వేటగాళ్ల ఘోరకలి బట్టబయలు

## కరెంట్ ఉచ్చుకు బిజ్జ వెంకన్న బర్రె బలి

## సంఘటనా స్థలంలో అడవి దుప్పి తల లభ్యం



**తొలి సమయం కొత్తగూడ 18 మే 2026**

గుంజేడు ముసలమ్మ వాగు కాల్వ వద్ద కిలోమీటర్ మేర విద్యుత్ ఉచ్చులు అటవీశాఖ పర్యవేక్షణపై ప్రశ్నలుగుంజేడు ముసలమ్మ దేవాలయం సమీప అటవీ ప్రాంతంలో వేటగాళ్ల కిరాతక చర్యలు వెలుగులోకి రావడం స్థానికులను కలవరపరిచింది. గూడూరు రేంజ్ అటవీ ప్రాంతం పరిధిలోని వాగు కాల్వ వెంట దాదాపు కిలోమీటర్ మేర విద్యుత్ తీగలను ఉచ్చులుగా అమర్చిన ఘటన తీవ్ర ఆందోళన కలిగిస్తోంది.వేటగాళ్లు అడవి జంతువుల కోసం అమర్చిన ఈ కరెంట్ ఉచ్చులో పడి, గుంజేడు గ్రామానికి చెందిన బిజ్జ వెంకన్నకు చెందిన విలువైన బర్రె మృతి చెందింది. గ్రామస్తులు సంఘటనా స్థలాన్ని పరిశీలించగా, అక్కడ క్రూరంగా వేటాడిన అడవి దుప్పి కళేబరానికి చెందిన తలను, మాంసంతో నిండిన సంచులను గుర్తించారు. ఈ దృశ్యాలు అక్కడి పరిస్థితుల తీవ్రతను స్పష్టంగా చూపిస్తున్నాయి.ఇటీవలే కొత్తగూడలోని ఇండియన్ బ్యాంక్ సమీపంలో వేటగాళ్లు తరలిస్తున్న దుప్పి తొంటి భాగం కిందపడిన ఘటన మరువకముందే, ఈ సంఘటన జరగడం గమనార్హం. వన్యప్రాణి సంరక్షణ కోసం నిత్యం పర్యవేక్షణ ఉందని చెప్పుకునే అటవీశాఖ సమీపంలోనే ఇంత పెద్ద ఎత్తున వేట సాగడం అధికారుల నిర్లక్ష్యంపై అనుమానాలు రేకెత్తిస్తోంది. ప్రతి శుక్రవారం మొక్కులు చెల్లించేందుకు కుటుంబాలతో భక్తులు వచ్చే ఈ దేవాలయ పరిసరాల్లో ఇలాంటి



ప్రాణాంతక విద్యుత్ ఉచ్చులు ఉండడం ప్రజల ప్రాణ భద్రతకూ ముప్పుగా మారింది. ఎప్పుడైనా మనుషులు లేదా పశువులు ఈ ఉచ్చులకు బలయ్యే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఈ ఘటనపై ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, బాధ్యులైన వేటగాళ్లను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని, అటవీ ప్రాంతంలో గస్తీ మరియు పర్యవేక్షణను మరింత కట్టుదిట్టం చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. వన్యప్రాణుల సంరక్షణతో పాటు, గ్రామస్తుల భద్రత కూడా సమానంగా పరిరక్షించాల్సిన అవసరం ఉందని వారు స్పష్టం చేస్తున్నారు.

### శాఖాధికారులపై గ్రామస్తుల మండిపాటు

గూడూరు రేంజ్ అటవీ ప్రాంతం పరిధిలో జరిగిన ఈ ఘటనపై గ్రామస్తులు అటవీశాఖ అధికారుల నిర్లక్ష్యాన్ని తీవ్రంగా తప్పుపడుతున్నారు. వన్యప్రాణి సంరక్షణ పేరుతో నిత్యం పర్యవేక్షణ జరుగుతుందని చెప్పుకునే శాఖ, దేవాలయ సమీపంలోనే కిలోమీటర్ మేర విద్యుత్ ఉచ్చులు అమర్చబడిన విషయాన్ని ఎలా గమనించలేకపోయిందని ప్రశ్నిస్తున్నారు. గుంజేడు ముసలమ్మ దేవాలయం వద్ద ప్రతి శుక్రవారం భక్తులు కుటుంబాలతో రాకపోకలు సాగించే ప్రాంతంలో ఇలాంటి ప్రాణాంతక ఉచ్చులు ఉండటం ప్రజల భద్రతపై శాఖ నిర్లక్ష్యానికి నిదర్శనమని మండిపడుతున్నారు. పశువులు, అడవి జంతువులు మాత్రమే కాకుండా, ఎప్పుడైనా మనుషులు కూడా బలయ్యే ప్రమాదం ఉందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవలే వేటకు సంబంధించిన ఘటనలు బయటపడుతున్నప్పటికీ, గస్తీ పెంచకపోవడం, అనుమానాస్పద కదలికలపై నిఘా పెట్టకపోవడం వల్లే వేటగాళ్లు రెచ్చిపోతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, అటవీశాఖ సిబ్బందిపై కూడా విచారణ జరిపి బాధ్యత నిర్ణయించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

